పసుపు దిగుబడులపై గంపెడాశలు

- ఉమ్మడి కృష్ణా జిల్లాలో 2,600 హెక్టార్లలో సాగు
- ఆకుతీత పనుల్లో రైతుల నిమగ్నం


కంకిపాడు మండలం ఈడుపుగల్లులో ఆకుతీతకు సిద్ధంగా ఉన్న పసుపు తోట

కంకిపాడు: వాణిజ్య పంటల్లో ప్రధానమైన పంటల్లో పసుపు కూడా ఒకటి. పంట చేతికి అందే తరుణం ఆసన్నమైంది. దీంతో రైతులు పసుపు ఆకుతీత పనుల్లో నిమగ్నమయ్యారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, తెగుళ్ల బెడద లేకపోవడంతో దిగుబడులపై గంపెడాశతో ఉన్నారు.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వాణిజ్య పంటల్లో పచ్చ బంగారంగా పిలిచే పసుపును రైతులు సాగు చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 2,100 హెక్టార్లలో, ఎన్‌టీఆర్ జిల్లాలో 500 హెక్టార్లలో ఈ సీజన్‌లో పసుపు పంట సాగయ్యింది. గతేడాది జూన్‌లో కురిసిన తొలకరి వర్షాలతో అన్నదాతలు పసుపు సాగు చేపట్టారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, దివిసీమ ప్రాంతంలోని చాలా మండలాల్లోనూ, ఎన్‌టీఆర్ జిల్లాలో అక్కడక్కడా పసుపు సాగు చేస్తున్నారు. ఫిబ్రవరితో పంట కాలం పూర్తి కానుంది.

ముమ్మరంగా ఆకుతీత పనులు

పసుపు పంట చేతికి వచ్చే తరుణమిది. పసుపు ఆకులు గోధుమ వర్ణంలోకి మారి ఎండిపోవడంతో పంట చేతికి వచ్చేందుకు సిద్ధంగా ఉందని రైతులు భావిస్తారు. ప్రస్తుతం వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా పసుపు ఆకుతీత పనులను చేపడుతున్నారు. తీసిన ఆకును కట్టలు కట్టి పసుపు పంట ఉడికించేందుకు నిల్వ చేస్తున్నారు.

దిగుబడులపై గంపెడాశలు

ఈ సీజన్‌లో పసుపు సాగుకు వాతావరణం అనుకూలంగా ఉంది. అధిక వర్షాలు కారణంగా ఎక్కడా పసుపు పంటకు నష్టం వాటిల్లిన పరిస్థితులు లేవు. అంతే కాకుండా తెగుళ్ల బెడద కూడా తక్కువే. ఎకరం విస్తీర్ణంలో పసుపు పంట సాగుచేసి, పంటను పొందే సమయానికి రైతుకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షలు పెట్టుబడి అవుతుంది. అదే కౌలురైతులు అయితే రైతుకి ఎనిమిది క్వింటాళ్లు ఎండు పసుపును కౌలుగా చెల్లించాల్సి ఉంది. అనుకూల వాతావరణం ఉండటంతో పంట దిగుబడులు కూడా ఈ ఏడాది 25 క్వింటాళ్లు నుంచి 30 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఆశించిన దిగుబడులు, మార్కెట్‌లో మంచి ధర లభిస్తే గట్టెక్కిపోతామని అంటున్నారు.

అన్ని విధాలా అండగా...

రాష్ట్ర ప్రభుత్వం గత వ్యవసాయ సీజన్‌లో క్వింటా ధర రూ.6,850 చెల్లించి మార్కెట్‌లో దోపిడీకి గురి కాకుండా రైతులకు బాసటగా నిలిచింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రధానంగా కంకిపాడు సహా, పలు చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేసింది. దీనికి తోడు సాగు మొదట్లోనే డాక్టర్ వైఎస్సార్ పంటల బీమా పథకాన్ని వర్తింపజేసింది. కృష్ణాజిల్లాలో 3,750 మంది రైతులకు 7,047.12 ఎకరాలకు గానూ రూ.37.34కోట్ల సొమ్మును రైతులకు అందించింది. ఈ సొమ్ముతో చాలా మంది రైతులు పెట్టుబడులకు వినియోగించుకుని సాగులో నిమగ్నమయ్యారు. పంట చేతికి వచ్చే నాటికి మంచి ధర వస్తుందనే గంపెడాశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా చండీహోమం



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలోని విజయరాజరాజేశ్వరి సమేత శ్రీ విజయ సుందరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం చండీహోమం ఘనంగా చేశారు. ఆలయంలో సప్తమ వార్షికోత్సవం సందర్భంగా మూడురోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు 108 మంది దంపతులతో ఘనంగా చండీహోమం చేశారు. ఉదయం స్వామివార్లకు పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి శాంతకల్యాణం శ్రీ వాసుదేవానందగిరిస్వామీజీ ఆధ్వర్యంలో జరిగింది. భక్తులను అన్నసమారాధన చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థినులకు నగదు బహుమతులు



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థినులకు శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్ సంస్థ రూ. 51 వేలు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేసినట్లు హెచ్ఎం సీహెచ్. అనిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థినులకు ప్రతిభ ఆధారంగా రూ. 3 వేల చొప్పున అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకొచ్చిన శ్రీరామ్ ఆటోమాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా విద్యార్థినులు చదువుల్లో మరింతగా రాణిస్తారని పేర్కొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ




పాతపాడు(విజయవాడరూరల్): పాతపాడు గ్రామ శివారు సీతారామపురం గ్రామంలో వృద్ధాశ్రమంలో అనాథలకు చిరువోలు దుర్గానాగేశ్వరావు జయంతి సందర్భంగా ఆయన కుమారుడు (ఏపీ గవర్నమెంటు డ్రైవర్స్ అసోసియేషన్ ప్రెసిడెంటు) చిరువోలు శ్రీనివాసరావు రూ.10 వేల విలువ చేసే నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనాథాశ్రమం నిర్వాహకులు దేవగిరి శివకుమారి, బెజవాడ ఇంజినీర్స్ లయన్స్‌క్లబ్ ట్రెజరర్ ఎం.పాండురంగారావు, రామారావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



పెనమలూరు: గోసాల గ్రామంలో వృద్ధులకు దాతలు ఆదివారం అన్నదానం చేశారు. గ్రామంలో ఉన్న వాసవ్య మహిళా మండలి వృద్ధుల ఆశ్రమంలో అనాథ వృద్ధులు 30 మందికి ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్న వక్కలగడ్డ సౌజన్య తన భర్త వక్కలగడ్డ సాంబశివరావు జ్ఞాపకార్థం అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎస్సై లంక రవీంద్రబాబు పాల్గొన్నారు.

60 మంది రక్తదానం



పెనమలూరు: కానూరులో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మాతృహృదయ్ స్వచ్ఛంద సేవాసంఘం ఆధ్వర్యంలో డాక్టర్ పిన్నమనేని సుధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ సహకారంతో కానూరు కార్మెల్ చర్చిలో ఫాదర్స్ బాలస్వామి, రాయప్ప, వైద్యులు కె.చక్రవర్తి, జాస్మిన్ సుల్తానా రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 60 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి హిమోగ్లోబిన్, బ్లడ్‌గ్రూప్, బీపీ పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నే చిట్టిబాబు, సంస్థ ప్రతినిధి తాళ్లూరి అశోక్, వైఎస్సార్ సీపీ నాయకులు హనుమంతరావు, ఖాదర్, తాళ్ల నరేంద్ర, శాంతిరాజు, వీఆర్వో శ్రీనివాసరావు, ప్రముఖులు సీపీఓ నాగేశ్వరరావు, జయరాజ్, పవన్‌చంద్, సాయి, వెంకట్ పలువురు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పెనమలూరు: పెనమలూరులో కోడి పందేలు ఆడుతున్న 15 మంది వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్. గోవిందరాజు కథనం మేరకు పెనమలూరు గ్రామ పరిధి ఆశ్రమం కాలువ కట్ట ప్రాంతంలో కొందరు కోడి పందేలు నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో 15 మంది వ్యక్తులు, రెండు పుంజులు, రెండు కత్తులు, రూ.60,050 సొమ్ము స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు



సదస్సులో మాట్లాడుతున్న బాకీ బాబు

కంకిపాడు: విద్యారంగ పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈడుపుగల్లులోని విజయ గార్డెన్స్‌లో నందేటి నాంచారి ప్రాంగణంలో 76వ వార్షిక కౌన్సిల్ సమావేశం, విద్యా సదస్సు ఆదివారం నిర్వహించారు. సదస్సులో బాకీ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు కొత్త జీవం వచ్చిందన్నారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగునకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యారంగ సదస్సులో విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సంఘ ప్రతినిధులు చెప్పకపోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఎంవీఎస్ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వేముల బిక్షమయ్య, ప్రధాన కార్యదర్శి జి.ప్రసాద్, రాష్ట్ర నాయకులు కె.ప్రసాద్, దూపం చంద్రశేఖర్, ఆహ్వానకమిటీ అధ్యక్షుడు పచ్చిగళ్ల సురేష్‌బాబు పాల్గొన్నారు.

యనమలకుదురు ఈద్గా కమిటీ ఏర్పాటు


ఈద్గా సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పెనమలూరు: యనమలకుదురు ఈద్గా, కబరస్తాన్ వెల్ఫేర్ సొసైటీ (జన్నతుల్ బఖి కబరస్తాన్ ఔర్ ఈద్గా) నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేశామని అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన వివరాలు తెలుపుతూ గత కొద్ది కాలంగా ఈద్గా, కబరస్తాన్, దుకాణాలకు సంబంధించి వివాదం ఉండటంతో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో గ్రామంలో ఉన్న ఆరు మసీదుల నుంచి తాత్కాలిక కమిటీ వేశారని దానికి తాను అధ్యక్షుడిగా ఉన్నానని తెలిపారు. అయితే ఆదివారం పూర్తి స్థాయిలో కమిటీ వేసేందుకు ఆరు మసీదుల నుంచి సభ్యులతో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు చేశామని వివరాలు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ మౌలాలీ, ఉపాధ్యక్షుడిగా హమీద్‌ఖాన్, కార్యదర్శిగా సయ్యద్ అస్లామ్, ఉప కార్యదర్శిగా సుభాని, కోశాధికారి అబ్దుల్‌నదీం, గౌరవ సలహాదారుడిగా షహెన్‌షాను నియమించామని తెలిపారు. వీరితో పాటు సాధారణ సభ్యులు 15 మంది ఉంటారన్నారు. భవిష్యత్‌లో ఈద్గా, కబరస్తాన్ అభివృద్ధికి కమిటీ పని చేస్తుందన్నారు. దుకాణాల నిర్వహణ బాధ్యత కూడా కమిటీ నిర్వహిస్తుందన్నారు. కమిటీ నియామకానికి పూర్తిగా సహకరించిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు, పోలీసులకు కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

గాయపడిన యువకుడికి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే


సంఘటన స్థలం వద్ద ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

గన్నవరం: రోడ్డు ప్రమాద బాధితుడిపై దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ధైర్యం చెప్పిన సంఘటన గన్నవరంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. అదే సమయంలో విజయవాడ వైపు వెళుతున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఈ సంఘటన చూసి కారు ఆపి వచ్చారు. ప్రమాదానికి గురైన యువకుడితో మాట్లాడిన ఆయన వైద్య సాయం కోసం 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. అనంతరం గాయపడిన యువకుడికి ధైర్యం చెప్పి అక్కడి నుంచి వెళ్లారు.

ఓటరుకార్డుకు గుర్తింపు కార్డు అనుసంధానం


నున్నలో ఓటరుకార్డుకు గుర్తింపు కార్డు అనుసంధానం

విజయవాడరూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని గ్రామాల్లో ఓటరుకార్డుకు ఏదైనా గుర్తింపు కార్డును అనుసంధానం చేసే కార్యక్రమాన్ని బూత్‌స్థాయి అధికారులు నిర్వహించారు. మండలంలో గన్నవరం నియోజకవర్గం పరిధిలో 77, మైలవరం నియోజకవర్గం పరిధిలో 52 చొప్పున పోలింగ్ కేంద్రాలున్నాయి. ఆ కేంద్రాలకు పోలింగ్ బూత్ స్థాయి అధికారులుగా పనిచేస్తున్న వారు ఓటరుకార్డుకు ఏదైనా గుర్తింపు కార్డుతో అనుసంధానం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. 250 మంది ఓటర్లతో కార్డు అనుసంధానం చేసినట్లు తహసీల్దారు పి.జాహ్నవి తెలిపారు. మండలంలో మొత్తం లక్షా 25వేల 780 ఓటర్లుండగా, వారిలో మైలవరం నియోజకవర్గానికి సంబంధించినవి 11వేలు, గన్నవరం నియోజకవర్గానికి సంబంధించినవి 32 వేలు ఓటరుకార్డులు అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దారు విజయకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్‌సింగ్, ఏఎస్ఓ విజయలక్ష్మీ పరిశీలించారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు

దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు


క్లోక్‌రూమ్ వద్ద భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు అధికారులను ఆదేశించారు. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, పాలక మండలి సభ్యులు ఆదివారం ఆలయ పరిసరాల్లో తనిఖీలు నిర్వహించారు. మల్లేశ్వర స్వామి వారి మెట్ల నుంచి కనకదుర్గనగర్ వరకు నడుచుకుంటూ వెళ్లిన చైర్మన్, పాలక మండలి సభ్యులు భక్తులతో మాట్లాడారు. దేవస్థానం భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. మెరుగైన దర్శనం కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఘాట్‌రోడ్డులోని టోల్‌గేట్ నుంచి ఓం టర్నింగ్ వరకు చేరుకున్న పాలక మండలి రోడ్డు గతుకులమయంగా ఉండటంతో అధికారులను ఆరా తీశారు. రోడ్డు ఎత్తుపల్లాల వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

మినరల్ వాటర్ పరిశీలన

వేసవి దృష్ట్యా ఎండ వేడి తగలకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులకు మంచి నీటి, మజ్జిగను పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓం టర్నింగ్ చైనా వాల్ వద్ద కృష్ణానది, ప్రకాశం బ్యారేజీ వీక్షించేందుకు తగ్గిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అదే విధంగా భక్తులు బస్సు కోసం వేచి ఉండే చోట చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఓం టర్నింగ్ వద్ద నిలిపి ఉన్న దేవస్థానం బస్సును ఎక్కి భక్తులతో మాట్లాడారు. చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

అనంతరం ప్రసాదాల విక్రయ కౌంటర్లు, చెప్పుల స్టాండ్, లగేజీ కౌంటర్లను తనిఖీ చేశారు. ప్రసాదాలు కొనుగోలు చేసిన భక్తులకు తగిన చిల్లర ఇవ్వాలని, తగినన్ని ప్రసాదాలు ఇవ్వాలని సూచించారు. అదే విధంగా కౌంటర్లలోని సిబ్బందిని అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓం టర్నింగ్ వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ను తాగి పరీక్షించారు. చైర్మన్ వెంట పాలక మండలి సభ్యులు బచ్చు మాధవీకృష్ణ, బుద్దా రాంబాబులతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి


కరాటే విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న బొప్పన భవకుమార్

నున్న(విజయవాడరూరల్): కరాటే విద్యార్థులు మరింత ప్రతిభ కనబర్చి ఉన్నతంగా రాణించాలని వైఎస్సార్ సీపీ విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్ ఆకాంక్షించారు. కోఫో కోచ్ ఆంధ్ర చీఫ్ ఎగ్జామినర్ కోచ్ టి.వాసు ఆధ్వర్యంలో నున్న గ్రామంలో స్టూడెంట్స్ కరాటే క్లబ్ డోజో నందు ఆదివారం విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. టెస్ట్ కోఫోకాన్ ఇండియా టెక్నికల్ డైరెక్టర్ ఎం.కనకరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి బొప్పన భవకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తయారు చేసిన చీఫ్ కోచ్ టి.వాసును అభినందించారు. కార్యక్రమంలో కరాటే కోచ్‌లు మాధవి, బల్లం కిషోర్, కన్నా, సత్య, పాండు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అన్నపురెడ్డి రామిరెడ్డి, దాసం దుర్గారావు, కె.ఫణీంద్ర, కె.హరి పాల్గొన్నారు.

రివర్ క్రాస్‌లో సత్తా చాటిన స్విమ్మర్లు


పతకాలు సాధించిన ఈడుపుగల్లు స్విమ్మింగ్ ఫ్యామిలీ

కంకిపాడు: రివర్ క్రాస్ పోటీల్లో ఈడుపుగల్లు స్విమ్మింగ్ ఫ్యామిలీ సత్తా చాటింది. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం 23వ కృష్ణా రివర్ క్రాస్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఈడుపుగల్లుకు చెందిన స్విమ్మింగ్ ఫ్యామిలీ బిళ్లా శ్రీనివాసరావు, బిళ్లా మీనా, బిళ్లా హర్షిత, బిళ్లా హర్షశ్రీ పాల్గొని రివర్‌క్రాస్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఒకే కుటుంబం రివర్ క్రాస్‌లో పాల్గొని సత్తా చాటడంతో డీఎస్‌డీఓ ఝాన్సీలక్ష్మి స్విమ్మర్లను అభినందించారు. బిళ్లా శ్రీనివాసరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈడుపుగల్లులోని స్విమ్మింగ్ పూల్‌లో తమ కుటుంబం శిక్షణ పొందుతుందని, రివర్ క్రాస్ పూర్తి చేయటం సంతోషంగా ఉందని తెలిపారు.

కంకిపాడులో ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

కంకిపాడు: వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చిన యువకుడు మృతి చెందిన ఘటన కంకిపాడులో ఆదివారం జరిగింది. ఈ ఘటనతో ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. మృతుడి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వైఎస్సార్ సీపీ నేతల చొరవతో వివాదం సమసింది. పట్టణానికి చెందిన వి.నాగరాజు (32) ఆదివారం సాయంత్రం గ్యాస్, గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు ప్రాథమిక వైద్యం అందించి, కొద్దిసేపు పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తీసుకెళ్లాలని సూచించారు. ఆ తరువాత కొద్దిసేపటికే నాగరాజు ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఆ సమయంలో ప్రధాన వైద్యుడు అందుబాటులో లేరు. సిబ్బంది వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నాగరాజు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఒకానొక దశలో సకాలంలో వైద్యం అందకే చనిపోయినట్లు మృతుని బంధువులు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న కంకిపాడు ఎస్ఐ కె.సుధాకర్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితి అదుపుతప్పకుండా చర్యలు తీసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైఎస్సార్ సీపీ నేతలు నత్తా వెంకటేశ్వరరావు, రాచూరి చిరంజీవి వచ్చి మృతుడి బంధువులతో మాట్లాడి, ఆస్పత్రి వైద్యులతో సంప్రదింపులు జరిపి వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పిన వివాహిత అదృశ్యంపై నున్న పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాది వాంబేకాలనీకి చెందిన ఎర్నింటి రవితేజకు అదే కాలనీకి చెందిన కరుణ(22)తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వారికి ముగ్గురు సంతానం కలరు. ఈనెల 25వ తేదీన పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి ఏడాదిన్నర కుమారుడితో వెళ్లింది. రవితేజ విచారించగా భార్య పుట్టింటికి వెళ్లలేదని తెలుసుకొని, బంధువులను విచారించగా ఆచూకీ తెలియలేదు. దీంతో రవితేజ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు.

470 మందికి కళ్లజోళ్ల పంపిణీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: దృష్టిలోపంతో బాధపడుతున్న పేదలకు దాతలు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. బాపులపాడు మండలం కానుమోలులో అన్నపూర్ణ ఏజెన్సీస్ అధినేత నూలు నరసింహారావు 470 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పేదలకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో దృష్టిలోపాలను గుర్తించి 470 మందికి కళ్లజోళ్లు ఇవ్వగా, మరో 25 మందికి ఇప్పటికే ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించామని నరసింహారావు తెలిపారు.

ముగిసిన పాలకవర్గ కమిటీ పదవీ కాలం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ పదవీ కాలం ఆదివారంతో ముగిసింది. రెండు సంవత్సరాల నుంచి చైర్మన్‌గా బోయిన భాను ప్రదీప్, ఎనిమిది మంది ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి ఇప్పటి వరకు ఆలయ అభివృద్ధిలో పాలు పంచుకున్నారు. వీరి పదవీ కాలం పూర్తి కావడంతో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఆలయ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఆసక్తి అందరిలో నెలకొంది.

నేడు 'స్పందన'

విజయవాడరూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి రూరల్ మండల రెవెన్యూ కార్యాలయంలో జరుగునని తహసీల్దారు పి.జాహ్నవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

పంటల కలెక్షన్ సెంటర్లకు 75 శాతం రాయితీ

గన్నవరం రూరల్ : ఉద్యాన పంటల సాగుదారులు రైతు సంఘాలుగా ఏర్పడితే 75 శాతం రాయితీతో ప్రభుత్వం కలెక్షన్ సెంటర్లు ఏర్పాటుకు సహాయం అందజేస్తుందని మండల హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కలెక్షన్ అండ్ గ్రేడింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని తమ ఉత్పత్తులను ఈ సెంటర్లలో కలెక్ట్ చేసి గ్రేడింగ్ చేయటం ద్వారా మంచిగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కలెక్షన్ సెంటర్లకు మొత్తంగా రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని, దీనిలో రైతులు తమ వాటాగా రూ.3.75 లక్షలు చెల్లిస్తే ప్రభుత్వం రూ.11.25 లక్షలు అందజేస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఉద్యాన పంటల సాగుదారులందరూ వినియోగించుకోవాలని సూచించారు.

నేడు ఆలయ భూమికి వేలంపాట

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని శ్రీ సీతారామస్వామి ఆలయానికి చెందిన 2.30 సెంట్లు భూమిని సోమవారం సీల్డ్ టెండర్- బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆర్ఎస్ నంబరు 186లోని దక్షిణం వైపు న్యూ ఆటోనగర్ రోడ్డును ఆనుకొని ఉన్న సుమారు 1936 చదరపు గజాల్లో ఐదు బిట్లుగా ఉన్న స్థలాన్ని వేలం వేస్తున్నామన్నారు. ఉదయం స్వామి దేవస్థానం ప్రాంగణంలో దేవదాయశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో 11 సంవత్సరాల కాలపరిమితికి సీల్డ్ టెండర్ - బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

లోక కల్యాణార్థం దినత్రయ చతుర్వేద మాస పారాయణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని టీటీడీ వేదపారాయణ పథకం ఆధ్వర్యాన వేద పండితులచే దినత్రయ చతుర్వేద మాస పారాయణం నిర్వహిస్తున్నామని పథకం జిల్లా సూపర్‌వైజర్ గుళ్లపల్లి శివశర్మ శ్రౌతి తెలిపారు. అయోధ్యనగర్ శ్రీదత్త సాయి శివకామేశ్వరీపీఠంలో టీటీడీ వేదపారాయణ పథకం ఆధ్వర్యాన ఆదివారం దినత్రయ చతుర్వేద మాస పారాయణం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం మూడు రోజుల పాటు పారాయణం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వేద పండితులు ఐక్య కంఠంతో పారాయణం చేశారు. భక్తులకు వేద పండితులచే ఆశీర్వచనం జరిగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై ఉచిత శిక్షణ

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో డిజిటల్ మార్కెటింగ్‌పై ఉచిత శిక్షణ తరగతులు మార్చి మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు డైరెక్టర్ పరదేశి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల శిక్షణ కాలంలో రోజూ ప్రాక్టికల్స్‌తో పాటు ఇంటర్న్‌షిప్ లైవ్ ప్రాజెక్ట్స్‌పై తర్ఫీదునిస్తారని చెప్పారు. ఇంటర్మీడియట్, డిగ్రీ చదివి 18–35 సంవత్సరాల వయసు కలిగిన యువతి, యువకులు అర్హులని చెప్పారు. శిక్షణ పొందువారికి ఉచిత భోజనం వసతి ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు 93479 56659, 91000 33552 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

కంకిపాడు: రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కోరామని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు తెలిపారు. ఆదివారం ఆయన కంకిపాడులో విలేకరులతో మాట్లాడారు. శనివారం నిర్వహించిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కంకిపాడు మండల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కంకిపాడులాకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రొసీడింగ్స్ జాప్యం అయ్యాయని, త్వరగా విడుదల చేస్తే నిర్మాణ పనులు చేపట్టే ఆస్కారం ఉంటుందని తెలిపామన్నారు. కంకిపాడు పట్టణం గుండా వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జాతీయ రహదారుల శాఖ అధికారులతో మాట్లాడి రోడ్డు అభివృద్ధి పనులు చేయించాలని కోరామన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణతాశాతం నూరుశాతం ఉండేలా చర్యలు సమర్థంగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు.